సాక్షి
అనంతపురం
శుక్రవారం । 23 । మే । 2025



టన్ను చీనీ రూ.38,120

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38,120 ప్రకారం ధర పలికాయి.



గురు'దేవరపల్లి'

పామిడి మండలంలోని దేవరపల్లికి చెందిన పలువురు గురువులుగా రాణిస్తున్నారు. ఈ ఊర్లో ప్రతి ఇంట్లోనూ అక్షరాస్యులు ఉండటం గమనార్హం.

10లో



జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కూడా తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ అధికారులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ (రెగ్యులర్ లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్) ఫలితాలు విడుదలయ్యాయి. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత గురువారం ఫలితాలు విడుదల చేశారు. మొత్తం 6,361 మంది పరీక్ష రాయగా, 6,270 (98.57 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏ కోర్సులో 346 మందికి గాను 339 మంది (97.98 శాతం), బీబీఏ కోర్సులో 530 మందికి గాను 521 (98.30 శాతం) మంది, బీసీఏలో 59 మందికి గాను 59 (100 శాతం) మంది, బీఎస్సీలో 1,809 మందికి 1,780 (98.40 శాతం), బీకాంలో 3,617 మందికి 3,571 (98.73 శాతం) ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఫలితాలకు జ్ఞానభూమి పోర్టల్‌లో చూడాలని కోరారు.

వ్యవసాయ శాఖలో బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభం



బదిలీ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న రెండు జిల్లాల జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రెండు జిల్లాల జేడీఏలు ఉమామహేశ్వరమ్మ, సుబ్బారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుజాత, సూపరింటెండెంట్ ప్రభాకర్ సమక్షంలో గురువారం ఉదయం డ్రైవర్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఏఈఓ)కు కౌన్సెలింగ్ చేపట్టారు. ఇందులో 70 మందికి పైగా ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు. జాబితాలు కమిషనరేట్‌కు పంపుతామని అధికారులు తెలిపారు. ఈనెల 26న అనంతపురంలో జోనల్ స్థాయిలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల అధికారులు, ఉద్యోగులు హాజరవుతారన్నారు. అన్ని విభాగాలకు సంబంధించి జూన్ 2 లోపు బదిలీ ఉత్తర్వులు వెలువడతాయని తెలిపారు.

పశుశాఖలో 91 మందికి బదిలీలు

- జూన్ 2 లోపు ఉత్తర్వులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో 91 మందికి (ఉమ్మడి జిల్లావ్యాప్తంగా) స్థానచలనం ఉంటుందని ఆ శాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి తెలిపారు. వీరందరూ ఒకే చోట ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారన్నారు. ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లు, ఏడుగురు అసిస్టెంట్ డైరెక్టర్లు, 20 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ (పశు వైద్యులు).. ఉండగా ఇరువురు వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ (వీఎల్ఏ), 8 మంది జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్, 21 మంది లైవ్‌స్టాక్ అసిస్టెంట్స్, ముగ్గురు వెటర్నరీ అసిస్టెంట్స్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్స్, ఒకరు జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు డ్రైవర్లు, మరో 23 మంది ఆఫీస్ సబార్డినేట్స్ బదిలీ కానున్నట్లు తెలిపారు.వీరు కాకుండా రిక్వెస్ట్, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్ కింద మరికొందరు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లా, జోనల్ స్థాయిలో పరిశీలన చేపట్టి జాబితాలు కమిషనరేట్‌కు పంపుతామన్నారు. జూన్ 2 లోపు బదిలీ ఉత్తర్వులు వెలువడతాయని తెలిపారు.

17 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 17 మండలాల పరిధిలో 5.6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఉరవకొండ 30.2 మి.మీ, బెళుగుప్ప 23.8, శెట్టూరు 18.2, కణేకల్లు 17, కళ్యాణదుర్గం 16.4, వజ్రకరూరు 16.2, ఆత్మకూరు 12 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే డీ. హీరేహాళ్, రాయదుర్గం, శింగనమల, బ్రహ్మసముద్రం, కంబదూరు, గుంతకల్లు, విడపనకల్లు, కూడేరు, గుమ్మఘట్ట, గార్లదిన్నె తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. శుక్రవారం కూడా జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.





స్వర్ణ వజ్రకవచ అలంకరణలో నెట్టికంటుడు, ప్రత్యేక అలంకరణలో మురడి ఆంజనేయస్వామి



నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పవన పుత్రా.. పాహిమాం

హనుమజ్జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. పవనపుత్రుడి క్షేత్రాలకు భక్తులు క్యూ కట్టారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. గుంతకల్లు మండలంలోని కసాపురం, బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు, డీ. హీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్

టీడీపీలో పెల్లుబుకుతున్న అసమ్మతి

- ఇటీవల 'అనంత మినీ మహానాడు'లో కార్యకర్త ఆత్మహత్యాయత్నం
- శింగనమల ఎమ్మెల్యే అవినీతిపై మంత్రికి ఓ తమ్ముడి ఫిర్యాదు
- గుంతకల్లు ఎమ్మెల్యే కుమారుడి దెబ్బకు ఒక కార్యకర్త ఆత్మహత్యాయత్నం
- హామీల అమలులో చేతులెత్తేసి అన్ని వర్గాలకూ ఇప్పటికే మోసం
- తమనూ దగా చేయడంపై 'తమ్ముళ్లు' రగిలిపోతున్న వైనం



తమ్ముళ్లకూ అన్యాయం



అనంతపురం మినీ మహానాడులో పురుగు మందు తాగి వేదిక ముందే పడిపోయిన టీడీపీ ఎస్సీ సెల్ నగరాధ్యక్షుడు వెంకటేష్ (ఫైల్)

- 'నేను పార్టీకి ఎంతో కష్టపడి చేసినా న్యాయం చేయలేకపోయారు' అంటూ మూడు రోజుల క్రితం అనంతపురంలో నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మినీ మహానాడు' కార్యక్రమంలో పురుగుల మందు తాగాడు. ఆయన పరిస్థితి ఇప్పుడు విషమంగా ఉంది. పట్టించుకునే దిక్కులేక ఆ కుటుంబం వీధిన పడింది. ఇలాంటి కుటుంబాలు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో చాలానే ఉన్నాయి.
- 'శింగనమలలో వెస్ట్ నరసాపురం నుంచి గెలిచిన ఏకైక టీడీపీ ఎంపీటీసీ నా భార్య అంజినమ్మ. కానీ మాకు ఎమ్మెల్యే ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదు' అంటూ టీడీపీ నేత ప్రసాద్ నాయక్ ఏకంగా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్‌కు ఫిర్యాదు చేశాడు. ఎమ్మెల్యే శ్రావణి ఎన్నిసార్లు వెళ్లినా పట్టించుకోలేదని, ఆమె తల్లి లీలావతి షాడో ఎమ్మెల్యేగా చలామణి అవుతూ వసూళ్లకు పాల్పడుతోందంటూ ఇటీవల మంత్రికి వివరించాడు.
- తన కుమారుడికి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తానని రూ.4 లక్షలు తీసుకుని మరొకరికి పోస్టు ఇవ్వడంతో గుంతకల్లుకు చెందిన టీడీపీ కార్యకర్త బిల్లే ఎల్లప్ప ఆత్మహత్యకు యత్నించాడు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తమ్ముడు గుమ్మనూరు నారాయణ.. బిల్లే ఎల్లప్ప కుమారుడు గిరీష్‌కు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్తానని రూ.4 లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత జయరాం కుమారుడు ఈశ్వర్.. గిరీష్‌ను తొలగించి మరొకరి దగ్గర రూ.8 లక్షలు తీసుకుని ఉద్యోగమిచ్చారు. దీంతో ఎల్లప్ప మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. ఈ మూడే కాదు.. ఉమ్మడి జిల్లాలో నేడు చాలా మంది టీడీపీ కార్యకర్తలు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎన్నికల ముందు అలవిగాని హామీలిచ్చి నేడు మోసం చేయడంతో అన్ని వర్గాలు అసంతృప్తిలో ఉన్నాయి. మరోవైపు ఎమ్మెల్యేల తీరుతో ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. ఇదే క్రమంలో తమను అన్యాయం చేస్తున్నారంటూ సొంత పార్టీకి చెందిన 'తమ్ముళ్లు' కూడా అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నారు. కూటమి సర్కారులో ఎమ్మెల్యేల దెబ్బకు టీడీపీ కార్యకర్తలు కుదేలవుతున్నారు. 11 నెలలు కూడా తిరక్కముందే ఎమ్మెల్యేలపై బహిరంగంగానే కార్యకర్తలు తీవ్ర వ్యాఖ్యలు చేస్తుండటం కలకలం రేపుతోంది. అవినీతి, అక్రమాలు, కబ్జాలు, వసూళ్లతో తమను గాలికొదిలేశారని, పార్టీని గెలిపించి తప్పు చేశామంటుండటం గమనార్హం.

ప్లాంట్ అప్పగించాలని వేధింపులు..

పెనుకొండ నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా 'గ్రీన్ టెక్' పేరుతో ఓ వ్యక్తి రీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నడుపుతున్నాడు. అయితే, ఈ ప్లాంటుపై కన్నేసిన మంత్రి సవిత తనకు అప్పగించాలంటూ నిర్వాహకుడిని భయపెట్టడం ప్రారంభించింది. కుటుంబానికి జీవనాధారమైన ప్లాంటును ఇవ్వాలనడంతో బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. మంత్రి ఒత్తిడి తట్టుకోలేక విధిలేని పరిస్థితుల్లో ఎంపీ పార్థసారథిని భాగస్వామిని చేసుకుని నడుపుకుంటున్నాడు.

ఉద్యోగులు.. అంగన్‌వాడీల పరిస్థితి ఘోరం

గత ఎన్నికల ముందు ఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలకు టీడీపీ నేతలు ఎన్నో హామీలు ఇచ్చారు. తీరా ఇప్పుడు చూస్తే ఎమ్మెల్యేలు ఉద్యోగులను దారుణంగా చూస్తున్నారు. మొన్నటికి మొన్న మార్కెట్ యార్డులో ఓ ఉద్యోగిని ''గాడిదలు కాస్తున్నావా'' అంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి అనడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. ఒకవైపు అంగన్‌వాడీ కార్యకర్తలు వేతనాల పెంపు కోసం ధర్నాలతో హోరెత్తిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిడ్ డే మీల్స్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను బెదిరించి ఉద్యోగాలు పీకేస్తున్నారు. సీఐలు, తహసీల్దార్‌లను ఇంట్లో పనిమనుషులకంటే హీనంగా చూస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యులను సైతం ఇష్టారాజ్యంగా తిడుతున్నారు. సచివాలయ ఉద్యోగులను రేషనలైజేషన్ పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇదే క్రమంలో 'తెలుగు తమ్ముళ్ల'నూ ఇబ్బందులకు గురి చేస్తుండటం గమనార్హం.

ఎమ్మెల్యేల తీరు దారుణం



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు

అనంతపురం సిటీ: ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి ప్రసాద్ ప్రజా ప్రతినిధుల్లా కాకుండా వీధి రౌడీల్లా ప్రవర్తించడం దారుణమని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు విమర్శించారు. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఉండగా, ఆమె అనుమతి లేకుండా చాంబర్‌లోకి వెళ్లడాన్ని తప్పుబడుతూ అనంతపురం జెడ్పీ కార్యాలయం ఎదుట గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం నిరసన తెలిపారు. బీసీ కులానికి చెందిన బోయ గిరిజమ్మను అవమానించడమే లక్ష్యంగా ఎమ్మెల్యేలు జెడ్పీకి వచ్చారని బహుజన యువజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రచర్ల హరి దుయ్యబట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో పాటు జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయవేదిక ప్రతినిధి కుళ్లాయప్ప, కనగానపల్లి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అంకె లక్ష్మన్న, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రామాంజనేయులు, విద్యార్థి విభాగం ప్రతినిధులు గంగవరం శశి, నసనకోట ముత్యాలు, మాదాపురం అనిల్, ఉపాధ్యక్షుడు యోహాన్, ఏపీ కార్మిక సంఘం ప్రతినిధి నాగేంద్ర, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్, బేడ, బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు తాటికొండ నాగరాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షుడు సాకే వన్నూరుస్వామి పాల్గొన్నారు.

30 శాతం రాయితీతో కందులు, పెసలు

- 50 శాతం రాయితీతో రాగులు, కొర్రలు
- విత్తన వరిపై రూ.500, రూ.వెయ్యి రాయితీ



కందులు



కొర్రలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ విత్తన పంపిణీలో భాగంగా 30 శాతం రాయితీతో కందులు, మినుములు, పెసలు, 50 శాతం రాయితీతో కొర్రలు, రాగులు ఇవ్వనున్నారు. ఈ మేరకు ధరలు, రాయితీలు ప్రకటించారు. విత్తన వరికి సంబంధించి జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) అమలు చేస్తున్న జిల్లాల్లో క్వింటా వరి విత్తనాలపై రూ.వెయ్యి రాయితీ వర్తింపజేయగా, ఎన్ఎఫ్ఎస్ఎం అమలులో లేని జిల్లాల్లో రూ.500 రాయితీ ఇవ్వనున్నారు. అంటే క్వింటా 5,204 రకం వరి విత్తనాలు పూర్తి ధర రూ.4,300 కాగా ఎన్ఎఫ్ఎస్ఎం జిల్లాల్లో రూ.1,000 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.3,300 చెల్లించాలి. ఎన్ఎఫ్ఎస్ఎం లేని జిల్లాల్లో రూ.500 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.3,800 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. ఇక విత్తన కందులు క్వింటా పూర్తి ధర రూ.10,950 కాగా 30 శాతం అంటే రూ.3,285 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.7,665 ప్రకారం చెల్లించాలి. అలాగే మినుములు పూర్తి ధర రూ.13,800 కాగా అందులో 30 శాతం అంటే రూ.4,140 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,660 ప్రకారం చెల్లించాలి. పెసలు పూర్తి ధర రూ.13,500 కాగా అందులో 30 శాతం రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.9,450 ప్రకారం చెల్లించాలి. కొర్రలు క్వింటా పూర్తి ధర రూ.6 వేలు కాగా.. 50 శాతం రూ.3 వేలు రాయితీ పోనూ మిగతా రూ.3 వేల ప్రకారం చెల్లించాలి. రాగులు పూర్తి ధర రూ.6,900 కాగా అందులో రాయితీ పోనూ రూ.3,450 ప్రకారం చెల్లించాలి. కందులు, పెసలు, మినుములు 4 కిలోల ప్యాకెట్ల రూపంలోనూ, కొర్రలు, రాగులు 2 కిలోల ప్యాకెట్లుగా ఇవ్వనున్నారు. భూ విస్తీర్ణం బట్టి కందులు, పెసలు, మినుములు ఒక్కో రైతుకు గరిష్టంగా 10 బ్యాగులు, కొర్రలు 5 బ్యాగులు, రాగులు 6 బ్యాగులు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ, ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి. ఇక.. వేరుశనగకు సంబంధించి ఇంకా ధరలు, రాయితీలు అధికారికంగా ప్రకటించలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. వేరుశనగ క్వింటా రూ.9,300 కాగా అందులో 40 శాతం రాయితీ రూ.3,720 పోనూ రైతులు తమ వాటా కింద రూ.5,580 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ



పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

- బీసీ మహిళ ప్రతిష్టకు భంగం కలిగించారు
- ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

అనంతపురం: 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. ఒక బీసీ మహిళ జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో ఉంటే కూటమి ప్రభుత్వానికి కంటగింపుగా మారింది' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ ధ్వజమెత్తారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి ముగ్గురు ఎమ్మెల్యేలు చొరబడి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటోను ధ్వంసం చేయడంపై నిరసన తెలిపారు. అప్రజాస్వామికంగా వ్యవహరించిన ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్‌తో కలిసి గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం గోరంట్ల మాధవ్ మీడియాతో మాట్లాడుతూ..ప్రధాని మోదీ భేటీ బచావో..భేటీ పడావో అంటూ దేశంలో మహిళల సర్వతోముఖాభివృద్ధి వైపు అడుగులు వేస్తుంటే రాష్ట్రంలో మాత్రం మహిళలను అవమానపరుస్తున్నార న్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్ లోకి ఎమ్మెల్యేలు దౌర్జన్యంగా వెళ్లి ఆమె ప్రతిష్టను దెబ్బతీసే రీతిలో వ్యవహరించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనుమతి లేకుండా చాంబర్‌లోకి వెళ్లి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో కిందపడేసి, ధ్వంసం చేశారని, సీఈఓను భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. జెడ్పీ సమావేశం జరుగుతుండగా, కావాలనే గందరగోళ పరిస్థితిని సృష్టించారన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా తలదించుకునే రీతిలో ప్రవర్తించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటోను తన కార్యాలయంలో పెట్టుకోవడం ఆమె హక్కు అని పేర్కొన్నారు. బోయ సామాజికవర్గానికి చెందిన గిరిజమ్మను అవమానపరిచే రీతిలో ప్రవర్తించడం చాలా బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలే దౌర్జన్యాలకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. ఏకంగా జెడ్పీ చైర్‌పర్సన్‌నే అవమానానికి గురిచేయడం, వారి అనుచరులు అనంతపురం మేయర్ వసీం చాంబర్‌లోనూ ఇదే తరహాలో ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు దాదు, జిల్లా సభ్యులు పావురాల జగదీష్, యువజన విభాగం నగర ఉపాధ్యక్షులు ఉదయ్, వినీత్, జనరల్ సెక్రటరీ బిల్లే నాగార్జున, సెక్రటరీలు వేణు, మైను, బ్రహ్మానంద రెడ్డి, వెంకట సుబ్బారావు, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, స్టేట్ స్పోక్ పర్సన్ సాకే చిరంజీవి, నాగార్జున నాయక్, గౌతమ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: కార్డుదారులకు డీలర్లు రేషన్ సక్రమంగా అందించేలా చూడాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం సాయినగర్‌లోని పలు చౌక దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బియ్యం, తూకం తదితరాలను పరిశీలించారు. కార్డుదారుల ఇళ్లకు వెళ్లి సరుకులు పంపిణీ ఎలా చేస్తున్నారు... తూకం సరిగా ఇస్తున్నారా.. అని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీజీఎస్ ఫీడ్‌బ్యాక్‌లో అనంతపురం అర్బన్‌లో ఎక్కువ మంది కార్డుదారులు బియ్యం నాణ్యత బాగా లేదని చెప్పారన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడంతో పాటు లబ్ధిదారులతో మాట్లాడామన్నారు. అనంతపురం రూరల్, గుంతకల్లు మండలాల్లో బియ్యం తక్కువగా ఇస్తున్నారనే ఫిర్యాదులు అధికంగా వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దారు హరి కుమార్, సీఎస్‌డీటీ రామకృష్ణ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయాలి

బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. 'కిషోరీ వికాసం'లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కిషోరీ వికాసం'లో జూన్ 10 వరకు జరిగే సమ్మర్ స్పెషల్ క్యాంపెయిన్‌లో డీఆర్‌డీఏ పీడీ పాల్గొనాలని, బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో గోడలపై పెయింటింగ్ వేయించాలని జెడ్పీ సీఈఓని ఆదేశించారు.గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ముస్లిం వర్గాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. మత పెద్దల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు.

'క్లీన్ ఎయిర్' పనులు పూర్తి చేయాలి

అనంతపురం అర్బన్: నగర పరిధిలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కింద చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేపట్టిన మల్టీ లెవల్ పార్కింగ్ పనులు పది రోజుల్లో పూర్తవ్వాలన్నారు. రామ్‌నగర్ బ్రిడ్జి వద్ద గ్రీనరీ అభివృద్ధి, ఇతర పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, నాణ్యతా ప్రమాణాలు లేనట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్, డీటీసీ వీర్రాజు, ఈఈ షాకీర్ హుసేన్, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆ టీచర్లకు సర్వీస్ పాయింట్లు ఇవ్వాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: రెండు డీఎస్సీల్లో సెలెక్ట్ అయి ప్రస్తుత బదిలీల్లో తీవ్రంగా నష్టపోతున్న ఉపాధ్యాయులకు మొదటి నుంచి సర్వీస్ పాయింట్లు కేటాయించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక ఉపాధ్యాయుడు మొదట ఎస్జీటీగా ఎంపికైన తర్వాత అన్ని అనుమతులతో ఎస్ఏగా సెలెక్ట్ అయినవారు ఒకే సర్వీస్ పుస్తకంలో అతని సర్వీస్ రాశారని వివరించారు. గత బదిలీల్లో సర్వీస్ పాయింట్లు వచ్చినా.. ప్రస్తుత బదిలీల్లో ఎస్ఏలుగా సెలెక్ట్ అయినప్పటి నుంచి సర్వీస్ పాయింట్లు మాత్రమే ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్‌లో వస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వారికి క్యాడర్‌తో నిమిత్తం లేకుండా సర్వీసులో చేరినప్పటి సర్వీస్ పాయింట్స్ ఇవ్వాలన్నారు. అలాగే ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ లిస్టులు సక్రమంగా రూపొందించలేదన్నారు. కొన్ని మండలాల్లో అన్ని అర్హతలు ఉన్నా యూపీ పాఠశాలలను కొనసాగించకుండా మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా డీగ్రేడ్ చేశారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వాటిని యూపీ పాఠశాలలుగా కొనసాగించక పోవడం చాలా అన్యాయమన్నారు.

గవి మఠం భూముల వేలం రద్దు చేయాలి



డీఆర్ఓ మలోలకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: గవి మఠం భూముల వేలాన్ని రద్దు చేయాలని డీఆర్ఓ ఎ.మలోలకు సీపీఐ నాయకులు విన్నవించారు. ఈ మేరకు డీఆర్ఓని గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, తదితరులు కలిసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం కొత్త కోట గ్రామంలో గవి మఠానికి సంబంధించి సర్వే నంబరు 590బి లో 12.5 ఎకరాలు, 835లో 39.63 ఎకరాలను 30 ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. దీనికి సంబంధించి గుత్త కూడా చెల్లిస్తున్నారన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న ఈ భూములను శుక్రవారం వేలం వేసేందుకు దేవదాయ శాఖ సిద్ధపడిందన్నారు. భూములు వేలం వేస్తే సాగుదారులైన పేదల కుటుంబాలు వీధిపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సాగులో ఉన్నవారికే భూములను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రాయుడు, రామాంజినేయులు, సాగుదారులు పాల్గొన్నారు.

ఉదయాన్నే పక్షుల కిలకిలరావాలు, ఆహారం కోసం అటు ఇటు తిరిగే సాధు జంతువులు.. ఎటు చూసినా పచ్చదనం పరుచుకున్న చెట్లు, తోటలు, పంట చేలతో ఎంతో అందంగా ఆహ్లాదంగా ఉండే ఊరు. అక్కడ వాహనాల మోతలు వినిపించవు. వ్యవసాయ ఆధారిత గ్రామంలో కల్మషం లేని రైతు బిడ్డలు సరస్వతీ పుత్రులుగా రాణించారు. ప్రతి ఇంట్లోనూ అక్షరాస్యులే. ఆ చదువులే వారి జీవిత గమనాన్ని మార్చాయి. అత్యధికంగా ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్నారు. ఇది పామిడి మండలం దేవరపల్లి పంచాయతీ ప్రజల విజయ ప్రస్థానం.

గురు దేవరపల్లి



దేవరపల్లి గ్రామ ముఖచిత్రం

- ప్రతి ఇంట్లోనూ అక్షరాస్యులే
- అత్యధికంగా ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్న దేవరపల్లి వాసులు

పామిడి: మండలంలోని దేవరపల్లి గ్రామ ప్రజలు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా పత్తి, వేరుశనగ పంటలను పండిస్తున్నారు. దేవరపల్లి పంచాయతీ పరిధిలో మజారా గ్రామంగా ఓబుళాపురం కూడా ఉంది. ఈ గ్రామం కూడా పూర్తిగా వ్యవసాయాధారితమే. రెండు గ్రామాల్లోనూ 3,200 మంది జనాభా ఉండగా... ప్రతి ఇంట్లోనూ అక్షరాస్యులే కనిపిస్తుంటారు. వీరిలో చాలా మంది టీటీసీ, డిగ్రీ, బీఈడీ, ఎంఈడీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు అభ్యసించి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడిన వారూ ఉన్నారు. ఇటీవల కొందరు సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. మొత్తం 50 మందికి పైగా ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడిన వారు ఉన్నారు.

స్థితిగతులు మార్చిన చదువు

దశాబ్దాల క్రితం దేవరపల్లిలోనూ నిరక్షరాస్యత రాజ్యమేలింది. సంప్రదాయ వ్యవసాయంతో కుటుంబాలను నెట్టుకొచ్చేవారు. ఈ క్రమంలోనే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలు ఎక్కువ కావడం... కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గ్రామస్తుల దృష్టి ఒక్కసారిగా చదువులపై పడింది. తమలా భవిష్యత్తులో పిల్లలు కష్టపడకూడదని భావించిన వారు.. పిల్లలను బడి బాట పట్టించారు. ఇది వారి స్థితిగతులను మార్చింది. నాడు ఒక్కరితో మొదలైన ప్రభుత్వ కొలువుల ప్రస్థానం నేడు పదుల సంఖ్యలో చేరుకుంది. కేవలం ఉపాధ్యాయ వృత్తిలోనే 50 మందికి పైగా స్థిరపడ్డారు. మరికొందరు రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. ఇంజినీర్లుగా, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. వృత్తి వ్యాపారాల్లోనూ రాణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకుని పంటల సాగు చేపట్టారు. పత్తి, వేరుశనగ, జొన్న, కొర్ర, పప్పుశనగ పంటల సాగుతో పాటు ఉద్యాన పంటలతో ఆదర్శ జీవనం సాగిస్తున్నారు.

గురువులే ఆదర్శం



మా తల్లిదండ్రులకు పది మంది సంతానం కాగా, వీరిలో ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అందరిలోకి నేనే లాస్ట్. వ్యవసాయం ఒక్కటే మా జీవనాధారం. మా నాన్న నారప్ప అప్పట్లో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. వ్యవసాయంలో నష్టాలు చూసి విసిగి పోయిన ఆయన చదువులు ఒక్కటే మా జీవితాలు మారుస్తాయని అనేవారు. అప్పట్లో మా ఊళ్లో పాఠాలు చెప్పేందుకు వచ్చే టీచర్లు పి.జయరాజు, టి.ఈశ్వరయ్య కూడా మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పారు. వారి స్ఫూర్తితోనే నేనూ ఎంఏ, ఎంఈడీ పూర్తి చేసి, ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాను. మా అక్క గౌరమ్మ, బావ, నా భార్య సైతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

– రామ్మోహన్, స్కూల్ అసిస్టెంట్, దేవరపల్లి గ్రామం

ఎంతో సంతృప్తినిస్తోంది



మాది వ్యవసాయ కుటుంబమే. మా తల్లిదండ్రులకు మొత్తం ఆరుగురు సంతానం కాగా, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కరువు పరిస్థితుల వల్ల పంటల సాగులో నష్టాలు వచ్చేవి. దీంతో చదువులు ఒక్కటే మా జీవితాలు మారుస్తాయని నమ్మిన అమ్మ, నాన్న మమ్మల్ని బడి బాట పట్టించారు. ఎంఏ, ఎంఈడీ పూర్తి చేసి, ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డాను. ఇది నాకెంతో సంతృప్తినిస్తోంది.

– నారాయణస్వామి, దేవరపల్లి గ్రామం

కుటుంబానికి చేదోడుగా ఉంటూ..



మాది సాధారణ వ్యవసాయ కుటుంబం. మా తల్లిదండ్రులకు ఏడుగురు సంతానం కాగా, ఇద్దరు కుమార్తెలు, ఐదుగురు కుమారులు ఉన్నారు. కుమారుల్లో నేనే పెద్దవాడిని. అమ్మ, నాన్న ప్రోత్సాహం.. గురువులు జయరాజు, ఈశ్వరయ్య స్ఫూర్తితో చదువులపై ఆసక్తి పెంచుకున్నా. ఓ వైపు వ్యవసాయ పనుల్లో అమ్మ, నాన్నకు తోడుగా ఉంటూనే మరోవైపు స్కూల్‌కు వెళ్లి వచ్చేవాడిని, ప్రాథమిక విద్యాభ్యాసం ముగిసిన తర్వాత దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పామిడిలోని పాఠశాలకు సైకిల్‌పై వెళ్లి వచ్చేవాడిని. పట్టుదలతో చదువుకుని ఎంఏ, బీఈడీ చేశాను. 35 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగాను. నన్ను ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని చాలా మంది ఉపాధ్యాయ వృత్తిలోకి రావడం గర్వంగా ఉంది.

– అనంతయ్య, విశ్రాంత టీచర్, దేవరపల్లి, పామిడి మండలం

క్రికెట్ మ్యాచ్ తెచ్చిన తంటా.. రెండు వర్గాల ఘర్షణ



గాయపడిన సాయి

గుంతకల్లు: క్రికెట్ మ్యాచ్‌లో చిన్నపిల్లల మధ్య జరిగిన గొడవలో పెద్దలు తలదూర్చడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని సత్యనారాయణపేట మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో ఈ నెల 19న చిన్నపిల్లలు క్రికెట్ మ్యాచ్ ఆడారు. మ్యాచ్‌లో ఉడదాల గణేష్, ముక్కన్నగారి హుస్సేన్ మధ్య ఘర్షణ జరిగింది. విషయాన్ని ఇంట్లో తెలపడంతో అదే రోజు రాత్రి ఇరు కుటుంబాల వారు గొడవపడ్డారు. ఆ సమయంలో ఉడదాల కుటుంబానికి చెందిన అంజి, వరుణ్, గణేష్ గాయపడ్డారు. దీంతో కక్ష పెంచుకున్న ఉడదాల కుటుంబ సభ్యులు గురువారం రాత్రి సంజీవనగర్‌లో నివాసముంటున్న ముక్కన్నగారి హుస్సేన్ చిన్నాన్న సాయిప్రసాద్‌పై దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి కొడవళ్లతో నరికి పరారయ్యారు. తలకు, కాళ్లకు తీవ్ర గాయాలైన సాయిని కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కాగా ఘర్షణ పడిన రెండు వర్గాలూ టీడీపీకి చెందినవే కావడం గమనార్హం. బాధితుల ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత : డీఎంఈ

గుత్తి: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని గుత్తి డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ అన్నారు. గుత్తి రైల్వే డీజిల్ షెడ్‌లో గురువారం రైల్వే కార్మికులు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంఈ హాజరై, మాట్లాడారు. అనంతరం డీజిల్‌షెడ్ ఆవరణలో కార్మికులతో కలసి మొక్కలు నాటారు.

స్పష్టత లేని బదిలీల జాబితాలు

- డీఈఓకు విన్నవించిన ఏపీటీఎఫ్ (1938) నాయకులు



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు, షెడ్యూలు విడుదలై ఓ వైపు దరఖాస్తు చేసుకుంటున్నా నేటికీ జాబితాల్లో స్పష్టత ఇవ్వలేదంటూ ఏపీటీఎఫ్ (1938) నాయకులు వాపోయారు. ఈ మేరకు గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని చాలా మండలాల్లో ఇప్పటి వరకూ ఏ స్కూల్లో ఏ ఉపాధ్యాయుడు సర్ ప్లస్ అయ్యాడనే దానిపై సమాచారం లేదన్నారు. ఎవరు బదిలీ కింద దరఖాస్తు చేసుకోవాలనే అంశంపై కూడా క్లారిటీ లేదన్నారు. అన్ని సబ్జెక్టులకు, ఎస్జీటీలకు సంబంధించిన ఫైనల్ వెకెన్సీ, ఫైనల్ ప్రమోషన్ సీనియార్టీ లిస్టు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ పూల్‌లో ఉన్న ఎల్పీలు, పీఈటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలా? వద్దా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలన్నారు. డీఈఓ ఆఫీస్ నుంచి పంపుతున్న సమాచారం సరైన రీతిలో సర్క్యులేట్ కావడం లేదన్నారు. పీహెచ్, వీహెచ్ ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీల నుంచి మినహాయింపు ఇస్తున్న తరుణంలో ప్రాథమికోన్నత పాఠశాలలో సర్ ప్లస్ కింద ఏ సబ్జెక్టు ఉపాధ్యాయులను తీసుకుంటారో.. సబ్జెక్టు వారీగా సీక్వెన్స్ తెలపాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, జిల్లా పూర్వ అధ్యక్షుడు రవీంద్ర, అదనపు ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు వజీర్‌బాషా, సాయినాథ్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు ఫక్రుద్దీన్, హుస్సేన్ ఖాన్ ఉన్నారు.

మెడికల్ కళాశాల అకౌంటెంట్‌పై ఫిర్యాదు

అనంతపురం: మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న మహిళా విద్యార్థినులకు సంబంధించిన మెస్ బిల్లులను నేరుగా సొంత ఖాతాలో జమ చేసుకున్న అకౌంటెంట్ వాణిపై కేసు నమోదు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ .మాణిక్యరావు కోరారు. ఈ మేరకు అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. హాస్టల్ బ్యాంకు ఖాతాకు కాకుండా తన వ్యక్తిగత ఫోన్‌పే నంబర్‌కు మెస్ బిల్లుల మొత్తాన్ని అకౌంటెంట్ జమ చేయించుకున్నారన్నారు. కొన్ని నెలలుగా మెస్‌బిల్లుల మొత్తం హాస్టల్ బ్యాంకు ఖాతాకు జమ చేయలేదన్నారు. ప్రొఫెసర్ల కమిటీ విచారణలో ఈ విషయం తేటతెల్లమైందన్నారు. డబ్బు తిరిగి చెల్లించేలా చూడాలని విన్నవించారు.

మహిళపై దాడి

తనకల్లు: మద్యం మత్తులో మహిళపై దాడి చేసిన ఘటన గురువారం నందిగానిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన రవి గురువారం ఉదయం మద్యం తాగి అదే గ్రామానికి చెందిన ఆదిలక్ష్మిపై దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలోకి చేరుకున్న ఆమెను వందేమాతరం టీం సభ్యులు తమ అంబులెన్స్‌లో చికిత్స కోసం తనకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'జాబితా మతలబు'పై కమిషనర్ ఆరా

- జాబితాలో ముందున్న రివర్షన్ టీచర్ పేరును కేడర్‌లో చివరిగా మార్పు చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: రివర్షన్ తీసుకున్న టీచరును ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల జాబితాలో ముందు వరుసలో చేర్చిన వైనంపై విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆరా తీశారు. ఫిజికల్ సైన్స్ టీచరుగా పని చేస్తున్న గుత్తా వెంకటనాయుడు 2023 జూలైలో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొంది ఆత్మకూరు మండలం తోపుదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. అక్కడ మూన్నెళ్లు పని చేసిన తర్వాత రివర్షన్ (తిరిగి స్కూల్ అసిస్టెంట్‌గా) కోరుకుని ప్రస్తుతం డి.హీరేహాల్ మండలం 74–ఉడేగోళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల్లో నిబంధనల మేరకు రివర్షన్ తీసుకున్న ఉపాధ్యాయుడిని ఆ కేడర్‌లో అందరి కంటే జూనియర్‌గా పరిగణించాలి. అంటే రివర్షన్ వచ్చిన రోజు నుంచి కొత్తగా సర్వీస్‌ను లెక్కిస్తారు. ఈ లెక్కన ఆయన ఫిజికల్ సైన్స్ టీచర్లలో చివరివాడిగా దాదాపు 730 వరుస సంఖ్యలో ఉంటారు. మొత్తం స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో తీసుకుంటే చివరి స్థానం 6,291 నంబరులో ఉండాలి. ఈ విషయం ఇక్కడి అధికారులు, డీఈఓ కార్యాలయ ఉద్యోగులకూ తెలుసు. అయితే ఓ సంఘం నాయకుడు చక్రం తిప్పడంతో చిట్టచివరన ఉండాల్సిన గుత్తా వెంకటనాయుడు పేరు మొదటి స్థానంలోకి వచ్చింది. ఈ వ్యవహారంపై గురువారం 'సాక్షి'లో 'పదోన్నతుల జాబితాలో మతలబు ఏమిటో?' శీర్షికన కథనం వెలువడింది. దీనిని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తీవ్రంగా పరిగణిస్తూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులతో గురువారం జరిగిన వెబెక్స్‌లో 'సాక్షి'లో వచ్చిన కథనంపై ఆయన చర్చ లేవనెత్తారు. విద్యాశాఖ జేడీ సర్వీసెస్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 16న ఫ్రీక్వెంట్లీ ఆస్క్‌డ్ క్వశ్చన్స్ (ఎఫ్ఏక్యూ)లో ఇదే అంశంపై స్పష్టంగా ఇచ్చినా... అనంతపురం జిల్లాలో రివర్షన్ టీచరును జాబితా ముందు వరుసలోకి ఎలా చేర్చారంటూ ప్రశ్నించారు. పక్కన రిమార్కులు రాశామంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేసిన జిల్లా అధికారులు.. చివరకు జాబితాను మార్పు చేస్తామంటూ వివరణ ఇచ్చారు. అనంతరం గుత్తా వెంకటనాయుడును మోస్ట్ జూనియర్‌గా పరిగణిస్తూ స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో చివరి పేరుగా చేర్చారు. ఇదే విషయాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు స్పష్టం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ కమర్షియల్ ప్రాపర్టీ అమ్మకం 6.3 సెంట్లు సౌత్ ఫేస్ సాయి నగర్, 3వ క్రాస్ నియర్ నేత్ర హాస్పిటల్ ATP 6281828329. [SCA25003992]

TOLET

■ అనంతపురంలో ప్రతి బిజినెస్‌కి సెంటర్ అయినా కమలానగర్ DCMS రోడ్‌లో 5 అంతస్థుల బిల్డింగ్ బాడుగకు ఇవ్వబడును. ఇది నర్సింగ్ హోమ్స్‌కి, Cloth షోరూంకి, బ్యాంక్స్‌కి ఎటువంటి Show Rooms మరియు ఇతర కమర్షియల్ బిల్డింగ్స్‌కి చాలా అనువుగా వుంది. ఇందులో 2 staircases & 3 లిఫ్ట్ వున్నాయి. కాంటాక్ట్ 9948266888. [A-854]

WANTED

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు. కావలెను. జీ: 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [SCA25003970]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు
అమ్మకు
రియల్ ఎస్టేట్
ఫర్నిచర్స్
ఆటోమొబైల్
కంప్యూటర్స్
సర్వీసెస్
కావలెను
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

■ అనంతపురం టౌన్ నందు పనిచేయుటకు ఆఫీసు సిబ్బంది కావలెను. M.S.ఆఫీస్ నందు అనుభవజ్ఞులై, హిందీ కూడా మాట్లాడాలి. Byke కలిగిన జెంట్స్ మాత్రమే సంప్ర: 9381838140, 8977731455. [A-1624]

■ ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్స్, ఫీల్డ్ మేనేజర్స్, ఆఫీస్ ఇంచార్జి, టెలికాలర్స్, ఆఫీస్ మేనేజర్ కావలెను. జీతం 20 వేలు. సం.ప్ర. 99084 29239 [SCA 25004005]

■ మెరైన్‌వాటర్ సొల్యూషన్స్ కంపెనీ యందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ టెక్నీ షియన్స్, ఫీల్డ్‌యందు పని చేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. Age: 21 to 28, Qly: Degree & MBA, Ramnagar, ATP. Ph: 9966620252, 9100703123. [HA-205251]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ బిల్ ఇన్ ప్రా నందు పనిచేయుటకు, అనుభవం గల టెలికాలర్స్ (స్త్రీలు) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టీమ్‌తో వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత. టార్గెట్‌తో పనిలేకుండా ఫిక్స్‌డ్ జీతం ఇవ్వబడును. అడ్రస్: 1వ ఫ్లోర్, సహారా అపార్ట్‌మెంట్, బళ్ళారి రోడ్, అనంతపురం.సెల్: 8919159081. [A-1622]

■ WANTED EXPERIENCED FEMALE STAFF FOR NUR, LKG, UKG, PRIMARY CLASSES (I-V) ALL SUBJECTS, COMPUTERS & LUCIDA H.W, DANCE & YOGA TO WORK IN BLOSSOMS SCHOOL, ARAVIND NAGAR, ATP.MOB:9030777676. [SCA25003972]


గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): వయసు మీరిపోతున్నా... పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నాటకలోని సండూరు తాలూకా తుమటి గ్రామానికి చెందిన గంగాధర్ (32) తోరనగల్లు సమీపంలోని జిందాల్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బెంగళూరులో మరో పని చేసుకునేందుకు వెళుతున్న ఇంట్లో చెప్పి నెల రోజుల క్రితం బయటకు వచ్చాడు. అనంతరం కుటుంబసభ్యులు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం తుమటి గ్రామ శివారున కర్ణాటక సరిహద్దులోని డి.హీరేహాళ్ మండలం సిద్దాపురం గ్రామ శివారులో చెట్టుకు వేసుకున్న ఉరికి వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 20 రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. విచారణలో మృతుడిని గంగాధర్‌గా గుర్తించి, సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించి నిర్ధారించారు. పెళ్లి ప్రయత్నాలు చేసినా సంబంధాలు కుదరకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా మృతుడి తండ్రి సిద్దేశ్వర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు వెంకటేశ్వర్లు

గుత్తి రూరల్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రాచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (44) వ్యక్తిగత పనిపై గురువారం గుత్తికి వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. గుత్తి మండలం వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహ ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

'కేంద్రియ'లో ప్రవేశాలకు దరఖాస్తులు



ప్రిన్సిపాల్ మల్కీ సాబ్

గుత్తి: పట్టణంలోని కేంద్రియ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మల్కీ సాబ్ తెలిపారు. స్థానిక విద్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 30 వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టెన్త్‌లో మ్యాథ్స్, సైన్స్‌లలో 60 శాతం మార్కులు వచ్చిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు.

తాడుతో గొంతు బిగించి.. కొడవలితో తలను వేరు చేసి

- యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాయదుర్గం టౌన్: ఈ నెల 15న చోటు చేసుకున్న యువకుడి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. రాయదుర్గం పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ జయనాయక్‌తో కలసి డీఎస్పీ పి.రవిబాబు వెల్లడించారు. రాయదుర్గం మండలం కొంతానపల్లికి చెందిన బోయ అంజినయ్య కుమారుడు వినోద్‌కుమార్ (22) టైలరింగ్‌తో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో స్వగ్రామంలో కాకుండా ఇతర ప్రదేశాల్లో స్థిరపడిన వినోద్‌కుమార్... ఇటీవల స్వగ్రామానికి చేరుకుని స్థానిక గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిలోకి చేరాడు. ఈ నెల 17న రాయదుర్గంలో జరిగిన ప్రసన్న వేంకటరమణ స్వామి రథోత్సవానికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. 18న కొంతానపల్లి వద్ద పొలంలో హతుడై కనిపించాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పక్కా ఆధారాలతో కొంతానపల్లికి చెందిన యువకులు నాయకుల రమేష్, నాయకుల బొమ్మలింగను గురువారం బళ్లారి మార్గంలోని చదం రైల్వే గేట్ వద్ద అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో హత్య చేసింది తామేనని అంగీకరించారు. హత్యకు గల కారణాలు వారు వెల్లడించారు.

మహిళల పట్ల అసభ్య ప్రవర్తన

గ్రామంలోని మహిళల పట్ల వినోద్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఈ క్రమంలో వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా చెడుగా ప్రచారమూ చేసేవాడు. దీంతో వినోద్‌కుమార్‌పై కక్ష పెంచుకున్న రమేష్, బొమ్మలింగ.. వినోద్‌కుమార్‌ను హతమార్చాలని నిర్ణయించుకుని అవకాశం కోసం వేచి చూశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న రాయదుర్గంలో శ్రీవారి రథోత్సవానికి వినోద్‌కుమార్ వెళ్లినట్లుగా తెలుసుకుని అదే రోజు దారి కాపుకాచారు. సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఒంటరిగా వస్తున్న వినోద్ కుమార్‌ను అడ్డుకుని పొలాల్లోకి లాక్కెళ్లి తాడుతో గొంతు బిగించారు. అనంతరం పదునైన కొడవలితో గొంతు కోసి తలను వేరుచేసి గుట్టు చప్పుడు కాకుండా ఉడాయించారు. హత్యకు ఉపయోగించిన నైలాన్‌తాడు, కొడవలి, మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రియల్టర్ ఇంట చోరీ



బీరువాలోని సామగ్రిని చెల్లాచెదురు చేసిన దృశ్యం

గుంతకల్లు: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆసీఫ్ ఇంట్లో చోరీ జరిగింది. ఇంటికి వేసిన తాళాలు బద్ధలు గొట్టిన విషయాన్ని గురువారం ఉదయం గుర్తించిన స్థానికులు ఆసీఫ్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన బంధువులు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఆసీఫ్ ఈ నెల 16న ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి అజ్మీర్ యాత్రకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో తాళం వేసిన ఇంటిని గుర్తించిన దొంగలు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. బీరువాను తెరచి అందులోని రూ.4.5 తులాల బంగారు నగలతోపాటు 8 తులాల వెండి, రూ.55వేలు నగదు, ఎల్ఈడీ టీవీ, బియ్యం బస్తాలు, ఇంటి ఆవరణలో ఉంచిన వాటర్ పంప్ మోటార్ అపహరించారు. బాధితుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



విద్యుత్ దీపాలంకరణలో యల్లమ్మ దేవాలయం



కురుబల ఆరాధ్య దేవర్లను దర్శించుకుంటున్న భక్తులు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

శింగనమల: సోదనపల్లిలో గురువారం ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. యల్లమ్మ పరుష, ఆగులూరప్ప స్వామి జల్ది పూజ వైభవంగా జరిగాయి. కురుబల ఆరాధ్య దేవరలైన రేవణ్ణ సిద్దేశ్వర, కాట్నేకాల్వ దేవరాయ గుణాచార్యులు, పెద్దయ్య, ఉజ్జినప్ప, ఆగులూరప్ప, నల్లబొల్లెప్ప, కొండారు పల్లయ్య, నాగులబురజప్ప, అంతరగంగప్ప, పెండేకల్లప్ప, శిలారామప్ప, బీరప్పస్వామి, గుంతకల్లప్ప, తాడిపత్రప్ప స్వామి, అయిలప్ప స్వామి, కోకొండ బీరప్ప స్వాములను పొలిమేర నుంచి అంగన్‌వాడీ స్కూల్ వరకూ ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.

క్లుప్తంగా

ఆర్టీసీని కాపాడుకునేందుకు ఉద్యమిస్తాం


మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్టీసీని కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి స్పష్టం చేశారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో సేవ్ ఆర్టీటీ అంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. ఆర్టీటీపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు అందరూ సిద్ధం కావాలన్నారు. ఎఫ్‌ఆర్‌సీఏను వెంటనే రెన్యూవల్ చేయాలని కోరారు. ఇందుకోసం ఎంపీ, ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. ఆర్టీటీపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఆర్టీటీ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం లేదని మండిపడ్డారు. ఆర్టీటీని కాపాడుకునేందుకు త్వరలోనే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అఖిల పక్ష కమిటీ జేఏసీ నాయకులు కేపీ రాజు, శ్రీనివాసులు, ప్రభాకర్, రామకృష్ణ, ఆనంద్, సూర్యనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

నేడు అపర ఏకాదశి

అనంతపురం కల్చరల్: భవసార క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అపర ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి ఆనంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తజన వల్లభుడైన పాండురంగడి నిజరూప దర్శనం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనంతకు చేరిన విధుశేఖర తీర్థ స్వామి


పూజల్లో పాల్గొన్న విధుశేఖరతీర్థ స్వామి

అనంతపురం కల్చరల్: హైందవ ధర్మప్రచార యాత్రలో భాగంగా శృంగేరీ మఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి గురువారం రాత్రి నగరంలోని శృంగేరీ శారదా శంకర మఠానికి విచ్చేశారు. వేదపండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులు, అర్చకులు స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మఠంలో కొలువుదీరిన శారదా శంకరులు, చంద్రమౌళీశ్వరుడికి స్వామి రుద్రాభిషేకాలు చేశారు. ఆధ్యాత్మిక మార్గంలో నడిచి ధర్మాన్ని కాపాడాలని భక్తులకు సూచించారు. మఠం మేనేజర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలతో పాటూ స్వామీజీ అనుగ్రహ భాషణం, అనంతరం భక్తుల పాదపూజలు, దర్శనం ఉంటాయని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


కేఎస్ జవహర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓ-2లు, ఇతర నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కేఎస్ జవహర్‌ను గురువారం జిల్లాకు చెందిన ఎంఈఓ-2 అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ కులాల ఉద్యోగుల సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అసోసియేషన్ నాయకుడు, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.రామచంద్ర, ఎంఈఓ-2 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.గురు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఓబుళపతి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న, మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నగేష్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకరమైన జీవనం


చెన్నేకొత్తపల్లిలో యోగా చేస్తున్న ప్రజలు

చెన్నేకొత్తపల్లి: యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక భాగం చేసుకోవాలి. యోగాతో ఆరోగ్యకర, సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చని ఎంపీడీఓ బాలక్రిష్ణుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. యోగా చేయడం వలన శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సిద్ధ సమాధి యోగా గురువు జయరామిరెడ్డి హాజరైన వారితో యోగాసనాలు వేయించారు. అలాగే యోగా చేయడం ద్వారా కలిగే లాభాలను వివరించారు.


రాప్తాడు: మౌనగిరి క్షేత్రంలో సీతారాములకు కల్యాణం


పూజల్లో పాల్గొన్న కలెక్టర్ వినోద్ కుమార్ దంపతులు


అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత


కోర్టు రోడ్డులో పూజలందుకున్న వరదాంజనేయ స్వామి

భజే వాయుపుత్రం

- ఘనంగా హనుమజ్జయంతి


హనుమంతుడి వేషధారణలో కళాకారుడు

అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు: శక్తివంతుడు, మహిమాన్వితుడైన హనుమజ్జయంతి వేడుకలు గురువారం అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో వైభవంగా జరిగాయి. పోటెత్తిన భక్తజన కోటి 'శ్రీహనుమాను జ్ఞానగుణ సాగర జయ కపీశ గుణలోకపు జాగర' అంటూ నామస్మరణ చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్ని చోట్లా అభిషేకాలు, అలంకార సేవలు, ఆకుపూజలు, అన్నదానాలు, గ్రామోత్సవాలు నిర్వహించారు. మల్లీశ్వరీ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని అన్నదానం చేశారు. సోములదొడ్డి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాప్తాడులోని మౌనగిరి క్షేత్రం, ఆత్మకూరు మండల వ్యాప్తంగా ఆంజనేయుడి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.


హనుమంతుడికి తులాభారం


అలంకరణలో హౌసింగ్ బోర్డులోని ఆంజనేయ స్వామి


నృత్యం చేస్తున్న చిన్నారులు


'జై శ్రీరాం' అంటూ రామకోటి రాయిస్తున్న దృశ్యం


హౌసింగ్ బోర్డులోని ఆంజనేయ స్వామికి క్షీరాభిషేకం

టీడీపీ నేతల తీరు అప్రజాస్వామికం

అనంతపురం: టీడీపీ నేతల తీరు అప్రజాస్వామికమని మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన టీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 'నేను పరిశీలిస్తాను.. అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు ఇవ్వాలని' ఎస్పీ సూచించారు. టీడీపీ నేతలు లక్ష్మీనరసింహ, సరిపూటి శ్రీకాంత్, నారాయణ స్వామి, నాగార్జున తదితరులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మేయర్ వసీం విలేకరులతో మాట్లాడుతూ.. తాను లేని సమయంలో చాంబర్‌లోకి దౌర్జన్యంగా వెళ్లి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేయడం టీడీపీ నేతల దౌర్జన్యాలకు పరాకాష్ట అని పేర్కొన్నారు. నా చాంబర్‌లో సీఎం చంద్రబాబు ఫొటో పెట్టాలి అనుకుంటే కమిషనర్ ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. అలా కాకుండా దౌర్జన్యంగా అటెండర్‌ను బెదిరించి తాళాలను లాక్కుని వెళ్లి తన చైర్‌ను తోసేసి ఫైల్స్‌ను పారవేశారన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తుందో.. లేక రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందో ప్రజలంతా గమనించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లో సైతం టీడీపీ ప్రజాప్రతినిధులు సీఈఓతో దురుసుగా ప్రవర్తించారన్నారు. నాలుగు గోడల మధ్య అధికారులతో వీరి వ్యవహార శైలి ఏ విధంగా ఉంటుందో తెలుస్తోందన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్, మేయర్ మహమ్మద్ వసీం సలీం చాంబర్లలో టీడీపీ నేతల వ్యవహరించిన తీరు వారి అధికార దుర్వినియోగానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. టీడీపీ నేతల తీరును నిరసిస్తూ క్రమశిక్షణ కలిగిన పార్టీ నేతలుగా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబిలేసు మాట్లాడుతూ.. టీడీపీ ప్రజాప్రతినిధులు జగనన్న ఫొటో చూస్తేనే భయపడిపోతున్నారన్నారు. వీధి రౌడీల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇషాక్, శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, నాయకులు దాదా, కాకర్ల శీన, దాదా ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ వసీం, తదితరులు

'ఎండీయూ వ్యవస్థ రద్దు సరికాదు'

అనంతపురం అర్బన్: ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం సరికాదు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి డిమాండ్ చేశారు. ఏవైనా లోపాలుంటే సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎండీయూ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే బియ్యం, సరుకులు అందించడం సౌకర్యంగా ఉందన్నారు. ఇలాంటి వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేయాలని నిర్ణయించడం సరైన చర్య కాదన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీలో ఎండీయూ వ్యవస్థను మరింత మెరుగుపరిచి అవినీతికి ఆస్కారం లేకుండా కొత్త సాంకేతికతో అనుసంధానం చేయాలని సూచించారు. ఒకవేళ వాహనం వచ్చే సమయంలో కూలీ పనులకు వెళ్లిన పేదలు అటు తరువాత చౌక దుకాణం వద్ద సరుకులు తీసుకునే ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల ద్వారా అక్రమ రవాణా జరుగుతోందనే నెపంతో ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. చౌక దుకాణాల వద్దనే బియ్యం, సరుకులు తీసుకోవాలని చెప్పడం సరైంది కాదన్నారు. ఎండీయూ వాహనాల రద్దుతో వాటి నిర్వాహకులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం, కందిపప్పు, నూనె, చింతపండు, తదితర సరుకులను ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు శ్యామలమ్మ, చంద్రిక పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి


రాతిదూలం లాగుతున్న వృషభాలు

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరులోని సయ్యద్ సర్దార్‌వలి దర్గా పక్కన గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటాపోటీగా వృషభాలు రాతిదూలాన్ని లాగాయి. మొత్తం 14 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ప్రథమ స్థాయి నుంచి ఏడవ స్థానంలో నిలిచిన వృషభాలకు బహుమతులు అందజేశారు. పోటీలను చూసేందుకు స్థానికులు భారీగా తరలివచ్చారు. – ఆత్మకూరు:

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలతో గురువారం నగరంలోని 74 సచివాలయాల పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పాతూరులో జరిగిన స్పెషల్ డ్రైవ్‌ను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ షాపుల ముందు చెత్తాచెదారం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో భాగంగా ప్రతి వ్యాపారస్తులు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ద్వారా పర్యావరణ పరిరక్షణ లేకుండా పోతుందన్నారు. ప్రజలందరూ సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్‌ను వినియోగించుకుండా క్లాత్, జూట్ బ్యాగ్‌లను వినియోగించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పర్యావరణానికి హాని కల్గించని ప్లాస్టిక్‌ను వాడుకోవచ్చన్నారు. నగరంలోని మొత్తం 50 షాపులపై రూ.73,525 జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రైవ్ నిరంతరంగా కొనసాగుతుందన్నారు.


పాతూరులో జరిమానా విధిస్తున్న కమిషనర్ బాలస్వామి

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో 'మాస్టర్స్' ప్రతిభ


అన్విత్ చౌదరి


అన్విత


నవ్యశ్రీ


రావి యాక్షిత్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అనంతపురం రూరల్ మండలం పాపంపేట కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న మాస్టర్స్ సైనిక్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఏడాది ఏప్రిల్ 5న జరిగిన ఈ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ అకాడమీ నుంచి ఏకంగా 24 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశానికి అర్హత సాధించారు. కె.అన్విత్ చౌదరి 300 మార్కులకు 279 సాధించినట్లు డైరెక్టర్ వి.కుపేంద్ర తెలిపారు. అలాగే మరం అన్విత, పి.ప్రణీశ్వర్, బొగ్గు లిఖిజ, పి.జిగ్నాస, రావి యాక్షిత్, టీఎం నవ్యశ్రీ, కె.మహిధర్, నిఖిలేశ్వర్, గవిరెడ్డి పామిరెడ్డి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. ఎక్కువమంది కలికిరి, కొడుగు, కజకూటం సైనిక్ స్కూళ్లకు అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను కుపేంద్ర అభినందించారు.

జాతీయ విద్యా విధానాన్ని సవరించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానం-2020కు ప్రత్యామ్నాయంగా ప్రజా విద్యా విధానం-2025 ముసాయిదాను గురువారం విడుదల చేశారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఐఎస్ఈసీ రాష్ట్ర అధ్యక్షుడు కె.వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు. కమిటీ అఖిల భారత ఉపాధ్యక్షుడు ఏ.చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ శేషయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రమణ్యం, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు జిలాన్ పాల్గొని ప్రజా విద్యా విధానం ముసాయిదా విడుదల చేసి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం 2020లో జాతీయ విద్యా విధానాన్ని చాలా క్లిష్ట సమయంలో ఆమోదించిందన్నారు. కోవిడ్ మహమ్మారితో పూర్తిగా స్తంభించినపుడు అర్థవంతమైన చర్చ జరపకుండా, పార్లమెంటులో కూడా చర్చించకుండానే హడావిడిగా కేవలం కేబినెట్ నిర్ణయంతోనే ఆమోదించారన్నారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నప్పటికీ ఏ రాష్ట్ర ప్రభుత్వాన్నీ సంప్రదించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రముఖ విద్యావేత్తలు, మేధావులు, విద్యను ప్రేమించే అన్ని రంగాల ప్రజల నుంచి నామమాత్ర అభిప్రాయాల్ని సేకరించిందన్నారు. అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండానే రాష్ట్రాలపై ఈ విధానాన్ని బలవంతంగా రుద్దిందన్నారు. సుప్రీంకోర్టు కూడా ఈ విషయమై ఏఐఎస్ఈసీ వాదనతో ఏకీభవించిందని గుర్తు చేశారు. విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చే విషయమై జాతీయ విద్యా విధానం మౌనంగా ఉన్నందున, భారత రాజ్యాంగాన్ని తదనుగుణంగా సవరించాలని పీఈపీ ప్రతిపాదిస్తోందన్నారు. మాతృభాషలు, ఆంగ్ల భాషను ప్రోత్సహించాలన్నారు.భాషా విధానాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి చేయాలని సిఫార్సు చేస్తోందన్నారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర కోశాధికారి వెంకటరమణ, నాయకులు మల్లిక్, దత్ కుమార్, హరీష్ కుమార్ రెడ్డి, నాగరాజు, హరీష్ బాబు పాల్గొన్నారు.


ముసాయిదా విడుదల చేస్తున్న ఏఐఎస్ఈసీ నాయకులు

వినతులకు పరిష్కారం చూపండి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌లో అధికారులకు ఇచ్చిన వినతులపై పరిష్కారం చూపాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్‌వీపీ రమణయ్య, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, నరేష్ తదితరులు డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రేడ్-2 ఉపాధ్యాయులకు సంబంధించి యాజమాన్యాల వారీగా అడహక్ సీనియార్టీ ప్రకటించిన తర్వాతనే ప్రమోషన్లు చేపట్టాలన్నారు. సీనియార్టీ జబితాలో అసంబద్ధాలను తొలిగించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో రీస్ట్రక్చర్ జరిగిన తర్వాత కేటగిరీల వారీగా, యాజమాన్యాల వారీగా పాఠశాలలకు కేటాయించిన పోస్టులను అధికారికంగా విడుదల చేయాలన్నారు. 2017 బదిలీల నుంచి 2023 బదిలీల వరకు ప్రిఫరెన్షియల్, స్పౌజ్ వాడుకున్న ఉపాధ్యాయుల జాబితాలనూ ప్రకటించాలన్నారు.


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

జెడ్పీ చైర్‌పర్సన్‌కు క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఎటువంటి అనుమతులు లేకుండా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి ప్రవేశించిన ఎమ్మెల్యేలు రాజు, అమిలినేని సురేంద్ర బాబు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ క్షమాపణ చెప్పాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరనాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్ నాయక్, చంద్రచర్ల హరి బుడగ జంగాల నాగరాజు మాట్లాడారు. ఎమ్మెల్యేలు కేవలం నియోజక వర్గాల్లో ఏమైనా సమస్యలు ఉంటే అడగాలన్నారు. అంతేకాని జెడ్పీ చైర్‌పర్సన్‌ను ప్రశ్నించే స్థాయి లేదన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సీఈఓను నీ ఉద్యోగం పీకేస్తా అంటూ మాట్లాడటం దుర్మార్గమన్నారు. మీకు దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ స్థానాలు గెలిచి అప్పుడు మీకు నచ్చిన ఫొటోలు పెట్టుకోవాలని సూచించారు. వెంటనే జెడ్పీ చైర్‌పర్సన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి ఎమ్మెల్యేలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రానికి సమీపంలో బైపాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. అనంతపురానికి చెందిన వ్యక్తులు కారులో కళ్యాణదుర్గం నుంచి అనంతపురం బయలుదేరారు. ఆత్మకూరు సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం దెబ్బతినగా.. కారులో ఉన్న ఓ పాప, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వీరిని వైద్య చికిత్సల కోసం ఆటోలో తీసుకెళ్లారు. హనిమిరెడ్డి పల్లి నుంచి ద్విచక్ర వాహనంలో ఇద్దరు వ్యక్తులు ఆత్మకూరుకు వస్తుండగా దెబ్బతిన్న కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అనంతపురం తరలించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220732, 9912220719, 9912220724
9010223702, 7093156622, 9010567770, 7093157766